నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 3 జనవరి 2024 | NALGONDA

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

మండలి చైర్మన్ నివాసంలో న్యూ ఇయర్ వేడుకలు

నల్లగొండ, జనవరి 2 : నల్లగొండలోని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి గుత్తాకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు పలువురు బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జడ్పీ వైస్ చైర్మన్ పెద్దులు, కనగల్ ఎంపీపీ కరీం పాషా , జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు ఐతగోని స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, హరికృష్ణ, పాదూరి ఇంద్రసేనారెడ్డి, రేగట్టె సైదులు, గుండె రవి, పరమేశ్, జగిని వెంకన్న, శ్రీనివాస్ ఉన్నారు.

7నుంచి డిగ్రీ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

రామగిరి, జనవరి 2 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీలకు ఈ నెల 7నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీసీ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా అమలు చేయాలని సూచించారు. యూనివర్సిటీ పరిపాలనా విభాగం మాత్రం యాథావిధిగా పని చేస్తున్నదని తెలిపారు.

4న ఎన్ఎస్ఎస్ జాతీయ శిబిరానికి వలంటీర్ల ఎంపిక

రామగిరి, జనవరి 2 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంజీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లను జాతీయ సమైక్యత శిబిరానికి పంపేందుకు ఈ నెల 4న ఎంజీయూలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వలంటీర్లను ఈ నెల 14నుంచి 20వరకు హైదరాబాద్‌లో నిర్వహించే శిబిరానికి పంపిస్తామని పేర్కొన్నారు. అందరూ విధిగా ఉదయం 10గంటలకు ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. వలంటీర్ల ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.

ఆగిన దళిత బంధు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలతో గ్రౌండింగ్ నిలిపివేసిన అధికారులు

మళ్లీ ఉత్తర్వులు ఇచ్చే వరకు లబ్ధిదారులకు ఇవ్వద్దని సర్కారు ఆదేశం

భవనగిరిలో గతంలో కేసీఆర్ సర్కార్ అందించిన దళితబంధు నిధులతో కొనుగోలు చేసిన వాహనాలు (ఫైల్)

సూర్యాపేట, (నమస్తే తెలంగాణ) /నల్లగొండ, జనవరి 2 : 'దళిత బంధు పథకాన్ని ఆపండి.. మేం ఉత్తర్వులు ఇచ్చే వరకు ఏ ఒక్క లబ్ధిదారుకు కూడా నిధులు ఇవ్వొద్దు' ఇది తెలంగాణలో కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ యంత్రాంగానికి ఇచ్చిన ఆల్టిమేటం. దాంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్ చేసి గ్రౌండింగ్ చేసే సమయంలో ఫుల్ స్టాప్ పడింది. ఈ నేపథ్యంలో తమకు దళిత బంధు వస్తుందని కొండంత ఆశతో ఉన్న దళిత కుటుంబాల్లో నిరాశ నెలకొన్నది. నల్లగొండ జిల్లాలో దళిత బంధు తొలి విడుతలో 517 మందికి రూ.10లక్షల చొప్పున ఇచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. రెండో విడుతలో నియోజకవర్గానికి 1100 మంది చొప్పున ఇస్తామని ప్రకటించి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలకు ముందే 1058 మంది లబ్ధిదారులు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా ఎస్సీ కార్పొరేషన్ యంత్రాంగం వారి పేర్లు ఆన్‌లైన్ చేసింది. నల్లగొండ నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. గ్రౌండింగ్ చేసే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. ప్రస్తుతం కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా ఆపాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించడంతో లబ్ధిదారుల ఆశలు నీరుగారుతున్నాయి.

తొలి విడుతలో ప్రతి యూనిట్ గ్రౌండింగ్

దళితులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఆలోచనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం జిల్లాలో తొలి విడుతలో నియోజకవర్గానికి వంద మంది చొప్పున అందజేసింది. రెండో విడుతలో 1100 మంది చొప్పున ఇవ్వాలని ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగానే నల్లగొండ, మునుగోడు, నకిరేకల్, నాగార్జున సాగర్, దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో తొలి విడుతలో 517 మందికి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.51.70 కోట్లు అందజేసింది. వాటితో ఆయా కుటుంబాల వారు కిరాణం దుకాణాలు, రవాణ వాహనాలు, వ్యవసాయ యంత్రాలు, డెయిరీ వంటి వ్యాపారాలు చేపట్టి సంతృప్తికరమైన ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు.

రూ.33 కోట్లు విడుదల చేసిన బీఆర్ఎస్ సర్కారు

దళిత బంధు రెండో విడుతలో నియోజకవర్గానికి 1100 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. ఎన్నికల నాటికి 1058 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తయి వారి పేర్లు ఆన్‌లైన్ కూడా అయ్యాయి. దాంతో ప్రభుత్వం తొలి దఫాగా ప్రతి లబ్ధిదారునికి రూ.3లక్షల చొప్పున ఇవ్వాలని తలచింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ చేసిన వారిని బట్టి మొత్తంగా రూ.33 కోట్లు విడుదల చేసింది. గ్రౌండింగ్ చేస్తున్న క్రమంలో ఎన్నికల కోడ్ రావడం వల్ల ఆ పథకానికి బ్రేక్‌లు పడ్డాయి. ఇప్పుడు కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించడంతో లబ్ధిదారుల ఆశలు నీరుగారుతున్నాయి.

సూర్యాపేట జిల్లాలో 67 మంది అకౌంట్లు ఫ్రీజ్

దళిత బంధు పథకం ద్వారా సూర్యాపేట జిల్లాలో తొలి విడుతగా నియోజకవర్గానికి వంద చొప్పున సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ మూడు నియోజకవర్గాలకు 300 కుటుంబాలకు అందజేసింది. తుంగతుర్తి నియోజకవర్గంలోని కొన్ని మండలాలు ఇతర జిల్లాలో ఉండగా, జిల్లా పరిధిలోని ఆరు మండలాలకు 45 మందికి.. జిల్లాలో మొత్తంగా 345 మందికి రూ.10 లక్షల చొప్పున రూ.34.50 కోట్లు మంజూరయ్యాయి. అలాగే తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలంలో మొత్తం దళిత కుటుంబాలు 2,223 మందికి రూ.222.30 కోట్లు అందజేసింది. వీరంతా గతంలో కూలీలు, గుమస్తాలు, డ్రైవర్లు తదితర పనులు చేసిన వారు. ఇప్పుడు దళిత బంధు పథకం ద్వారా యజమానులై ఉపాధి పొందుతూ మరి కొందరికి పని కల్పించే స్థాయికి వచ్చారు. రెండో విడుతలో గతేడాది నియోజకవర్గానికి 1100 చొప్పున జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాలకు కలిపి 4400 కుటుంబాలకు దళిత బంధు ఇచ్చేందుకు గత సర్కారు నిర్ణయించింది. ఆ వెంటనే అధికార యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించి జాబితాలు కూడా సిద్ధం చేసింది. సూర్యాపేటలో 58 మందిని గుర్తించి తొలి దఫా వారి అకౌంట్లలో రూ.2లక్షల చొప్పున రూ.1.16 కోట్లు జమ అయ్యాయి. తిరుమలగిరి మండలంలో తొమ్మిది మంది లబ్ధిదారులు మృతి చెందడంతో వారి నామినీ అకౌంట్లలో రూ.89.10 లక్షలు జమ చేశారు. అయితే.. ఎన్నికల కారణంగా ఆయా అకౌంట్లు ఫ్రీజ్ కాగా నెల రోజులుగా లబ్ధిదారులు తమ డబ్బు లు ఎప్పుడు విడుదలవుతాయని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం లబ్ధిదారుల అకౌంట్లలోనే డబ్బులు ఉండగా ప్రభుత్వం ఆదేశాల మేరకు వాటిని ఫ్రీజింగ్‌లో ఉంచినట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఎప్పుడు ఆదేశాలు వస్తే అప్పుడు విడుదల చేయనున్నట్లు సమాచారం.

మా పిల్లల భవిష్యత్‌ను నిలబెట్టండి

మా దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ సారు దళితబంధు పెట్టి ఆదుకుంటుండని అంతా సంబురపడ్డాం. ఎంతో మందికి చెక్కులు ఇచ్చింద్రు.. ట్రాక్టర్లు, కార్లు వచ్చినయ్. కిరాణంతోపాటు అనేక రకాల వ్యాపారాలతో వందలాది మంది దళితుల జీవితాలు మారినయ్. అట్లనే ఎంతో మంచి మనసుతో మా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆలోచన చేసి సూర్యాపేటలో చెప్పులు కుట్టుకునే కుటుంబాలకు దళితబంధు చెక్కులు అందించింద్రు. ఈ లోపే ఎన్నికలు సమీపించడంతో బ్యాంకు వాళ్లు తరువాత ఇస్తామన్నారు. ఇప్పుడు బ్యాంకుకు పోతే.. పైన అపింద్రు వాళ్లు విడుదల చేసినప్పుడు ఇస్తామంటున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం తొందరగా దళితబంధు డబ్బులు ఇప్పిస్తే షాపు పెట్టుకుంటే మా పిల్లల భవిష్యత్ నిలబడుతుంది.

– గోగుల భిక్షమయ్య, సూర్యాపేట, దళితబంధు లబ్ధిదారు

దళిత కుటుంబాల్లో వెలుగులు నింపాలి

మొదటి విడుత దళిత బంధుతో ఎంతో మంది అనేక రకాల వ్యాపారాలతో సంతోషంగా జీవిస్తున్నరు. అట్లనే విడుతల వారీగా అన్ని కుటుంబాలకు లబ్ధి చేకూరి మా దళితులందరి జీవితాలు మారుతాయనుకున్నం. రెండు నెలల క్రితం ఇక్కడి ఎమ్మెల్యే, అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో చెప్పులు కుట్టుకునే 18 కుటుంబాలను గుర్తించి దళిత బంధు ఇస్తానని హామీ ఇచ్చారు. అదే సమయంలో సూర్యాపేటకు వచ్చిన అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అందరికీ చెక్కులు అందించింద్రు. కానీ.. ఎన్నికలు రావడంతో ఆగిపోయాయి. ఎన్నికలు అయిపోయాక వస్తయనుకున్నం. ఇప్పుడు వెళ్తే పై నుంచి సార్లు చెప్పినంకనే ఇస్తామంటున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని డబ్బులు ఇప్పించి మా జీవితాల్లో వెలుగులు నింపాలి.

– గంట లింగయ్య, సూర్యాపేట

నిలిపివేయమని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందట

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ నియోజకవర్గంలో ప్రొసీడింగ్స్ ఇచ్చిన వారికి అప్పుడే నిధులు విడుదల చేసింది. ఎన్నికలు రావడంతో అప్పట్లో ఆగిపోగా ఇప్పుడు ఇవ్వాలని కలెక్టర్‌ను కలిశాం. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు దళిత బంధు పథకాన్ని నిలిపివేయమని ప్రభుత్వం ఆదేశించిందని కలెక్టర్ చెప్పారు. ఒక ప్రభుత్వం ఇచ్చినదాన్ని మరో ప్రభుత్వం వచ్చాక అమలు చేయాలి. కానీ.. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడం సరికాదు. ఈ నిధులు ఇచ్చే వరకు పోరాటం చేస్తాం. ఈ నెల 8న నిరంతర దీక్ష చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– పాలడుగు నాగార్జున, దళిత బంధు సాధన కమిటీ కన్వీనర్, నల్లగొండ

సృజనకు పదును.. ప్రతిభకు గుర్తింపు

పాఠ్యాంశాల బోధనలో సైన్స్ టీచర్ పవిత్ర ప్రత్యేకత

విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యం

రైతు, వాతావరణ సమస్యల పరిష్కారానికి కృషి

ఆమె సేవలకు రాష్ట్రస్థాయి అవార్డులు

తాజాగా 17నుంచి 20 వరకు జరిగే ఎన్ఎస్‌టీడబ్ల్యూకు ఆహ్వానం

విద్యార్థులతో ప్రయోగం చేయిస్తున్న ఉపాధ్యాయిని పవిత్ర

గరిడేపల్లి, జనవరి 2 : అన్ని వృత్తుల్లో కెల్లా ఆదర్శప్రాయమైనది ఉపాధ్యాయ వృత్తి. చాలా మంది దీనిని ప్రభుత్వ ఉద్యోగంగా మాత్రమే భావించి నెల వేతనం కోసం బాధ్యతలు నెరవేర్చుతారు. కానీ, విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యతమిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీసి మరింత పదును పెట్టే ప్రభుత్వ ఉపాధ్యాయులు చాలా అరుదు. విద్యార్థులకు అర్థవంతంగా బోధిస్తూ వారితో తగిన ప్రయోగాలు చేయిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికి తీస్తూ ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయిని మారం పవిత్ర. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది. ఇప్పుడు భారత ప్రభుత్వం కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా, నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్ షాప్‌కు ఆహ్వానం అందుకున్నారు.

బోధనలో ప్రత్యేక విధానం..

2008లో డీఎస్సీ ద్వారా బయోసైన్స్ ఉపాధ్యాయురాలిగా పవిత్ర ఉద్యోగం సాధించారు. మొదట ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం యూపీఎస్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు చేపట్టారు. 2012 నుంచి 2015 వరకు గోరెంట్ల జడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా, 2015 నుంచి గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల రూపకల్పనలు..

వరి పొలాల్లో రైతులు వరాలు తీయడానికి పడే కష్టానికి పరిష్కారం చూపడం, నీటిపై తేలే చెత్తను తొలగించడానికి ఉపయోగించే పరికరం, ఎకో ఫ్రెండ్లీ రాఖీల తయారీ, మొక్కలకు ఉపయోగపడే బయోటానిక్ లాంటివి ఈమె సారథ్యంలో విద్యార్థులు తయారు చేసినవే. లోహిత అనే అమ్మాయి రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ రాఖీలను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సాయిదీపక్, వెంకటేశ్ తయారు చేసిన ఫార్మర్ ఫ్రెండ్లీ సైకిల్‌ను గడ్డిపల్లి కేవీకేలో ప్రదర్శించగా మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందించారు. ఇవే కాకుండా చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో తమ ప్రయోగాలను ప్రదర్శించారు.

ఎస్సీఈఆర్‌టీ వీడియోలకు సహకారం

జాతీయ స్థాయిలో సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ యూట్యూబ్ ఛానల్ ద్వారా 2020-21 సంవత్సరానికి గానూ ఉపాధ్యాయులకు ఉపయోగపడే ఐసీటీ టూల్స్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ(ఎస్ఐఈటీ) హైదరాబాద్ ద్వారా 14 పాఠాలు బోధించారు. ఎస్సీఈఆర్‌టీ తెలంగాణ పాఠ్య పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ కంటెంట్ తయారీకి ఎస్సీఈఆర్‌టీ, దీక్ష ఆధ్వర్యంలో 60 వీడియోలు, 16 క్వచ్చన్ సెట్‌లను తయారు చేశారు. పుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వీడియోలు చూడవచ్చు. ఓపెన్ టెక్స్ట్ సైన్స్, టెక్నాలజీ, హోమ్ సైన్స్ పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాలు రాయడంలో పాలు పంచుకున్నారు.

ఐఐఎస్ఎఫ్ వర్క్‌షాప్‌కు ఎంపిక

భారత ప్రభుత్వం కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 20 వరకు ఫరీదాబాద్‌లో నిర్వహించే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా, నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్ షాప్‌కు పవిత్ర ఎంపికైంది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ నుంచి ఆహ్వానం అందుకున్నది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి 300 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొంటుండగా వివిధ సైన్స్ కృత్యాలపై వారికి అవగాహన కల్పించనున్నారు.

అందుకున్న అవార్డులు..

- టెక్ మహీంద్ర సైన్స్ టెక్నాలజీ ద్వారా ట్రాన్స్ ఫార్మింగ్ ఎడ్యుకేటర్ రన్నరప్ అవార్డును అందుకున్నారు.
- లయన్స్ ఇంటర్నేషనల్ వారు ఉపాధ్యాయులకు నిర్వహించిన వీడియో కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డు పొందారు.
- ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్‌డే సందర్భంగా సారాబాయ్ టీచర్ సైంటిస్ట్ నేషనల్ అవార్డును జమ్మూ కశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రవిశంకర్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2022 సందర్భంగా అకాడమిక్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైడ్ విమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఆన్‌లైన్‌లో పొందారు.
- 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు సాధించారు.
- 2023వ సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికయ్యారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

పదేండ్ల అభివృద్ధిపై క్యాలెండర్ ఆవిష్కరణ

బొడ్రాయిబజార్, జనవరి 2 : పదేండ్లలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్, బీఆర్ఎస్ పట్టణ జాయింట్ సెక్రటరీ కల్లెపల్లి మహేశ్వరీదశరథ 2024 సంవత్సరం క్యాలెండర్‌ను రూపొందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, రాష్ట్ర జైగౌడ సంఘం అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, కొణతం సత్యనారాయణ రెడ్డి, అయూబ్‌ఖాన్, బావుసింగ్, అనిల్‌రెడ్డి, శంకర్, సంతోష్‌శర్మ, శివ, కరుణశ్రీ పాల్గొన్నారు.

ధరణి నిలిపివేత?

రెండు రోజులుగా తెరుచుకోని సిటిజన్ లాగిన్ బుక్ కాని స్లాట్‌లు.. అయోమయంలో రైతులు

మాడ్యూల్స్ చెకింగ్‌తో తాత్కాలికంగా ఆగిందంటున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 2 : ధరణి నిలిపివేత దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇప్పటికే ధరణికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చే భూమాత పేరు మార్పిడితోపాటు ధరణిలో మాడ్యూ ల్స్ మార్పిడిపై సాంకేతిక బృందం కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్ప మిగతా పనులు అధికారులు పూర్తిగా నిలిపివేయగా తాజాగా రెండు రోజుల నుంచి సిటిజన్ లాగిన్ ఓపెన్ కావడం లేదు. సిటిజన్ లాగిన్ అయ్యే క్రమంలో ఫోన్‌కు వచ్చే ఓటీపీని పూర్తిగా నిలిపివేశారు. దీంతో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లేదు. కానీ తాసీల్దార్ లాగిన్‌లో మాత్రం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇప్పటికే ధరణిలో పేమెంట్ కట్ చేసి స్లాట్ బుక్ చేయకుండా ఉండడంతో కొందరు ఆందోళనకు గురవుతున్నారు. ముందస్తు ప్రకటన లేకుండా సిటిజన్ లాగిన్ నిలిపివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్న ధరణి మార్పిడితో నూతనంగా వచ్చే పోర్టల్‌పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ధరణిలో మాడ్యుల్స్ చెకింగ్ కారణంగా సర్వర్ సమస్యతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

నల్లగొండలోని ఓ పెట్రోల్ బంకులో వాహనదారుల రద్దీ

పెట్రోల్ కోసం క్యూ

ట్యాంకర్ యజమానుల సమ్మె ఎఫెక్ట్

నల్లగొండ, జనవరి 2: వాహనాల డ్రైవర్లు ఏదైనా ప్రమాదానికి కారణమై పారిపోతే (హిట్ అండ్ రన్ కేసులో) ఏడు లక్షల రూపాయల జరిమానాతో పాటు పదేండ్ల జైలు శిక్ష విధిస్తామని కేంద్రం చట్టం చేసింది. దానిని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ యజమానులు ఆందోళన చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోనూ మంగళవారం నిరసనలు జరిగాయి. దాంతో పెట్రోల్, డీజిల్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బంకుల వద్ద బారులుదీరారు. ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లో పెట్రోల్‌ను నింపుకొన్నారు. నిల్వలు అయిపోవడంతో పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో పలు చోట్ల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది.మధ్యాహ్నం వరకు ఖాళీగా ఉన్న బంకులు మూడు రోజుల పాటు సమ్మె చేస్తామని ప్రకటించటంతో బంకులకు వాహనాలు క్యూ కట్టాయి. ఆ తర్వాత సమ్మె చేయడం లేదని ఆయిల్ ట్యాంకర్ల అసోసియేషన్ ప్రకటించినప్పటికీ రద్దీ తగ్గలేదు.

సూర్యాపేటలోని ఓ బంకులో కిక్కిరిసిన వాహనదారులు